
# 'ప్రత్యూ'పకారం

విజ్ఞాన సుధ మంత్లీ.. ఫిబ్రవరి, 2003



"యువర్ అటెన్షన్ ప్లీజ్... గోదావరి ఎక్స్‌ప్రెస్ ఫ్రమ్ హైదరాబాద్ టు విశాఖపట్నం ఈజ్ రెడీ టూ స్టార్ట్ ఫ్రమ్ ప్లాట్‌ఫాం నెంబర్ టూ..!"

– మైక్‌లో ఎనౌన్స్‌మెంట్ వస్తోంది.

"ట్రైన్ కదుల్తోంది. లోపలికి వెళ్లి బెర్త్ ఆక్యుపై చెయ్యి!" అని అన్నగారు అనడంతో బోగీలోకి వచ్చాడు దినకర్.

"ఇంటికి చేరగానే సేఫ్‌గా వెళ్లినట్లు ఫోన్ చెయ్యమ్మా... మావాడికి అశ్రద్ధ!" ప్రత్యూష నుద్దేశించి అనేసరికి– "అలాగేనండీ!" అని సమాధానమిచ్చింది.

ఏడుస్తూన్న పప్పీని సముదాయిస్తూ హార్లిక్స్, బిస్కెట్ ప్యాకెట్ కొని ఇస్తూ- "అమ్మలూ! అన్నయ్యల్ని తీసుకొని సమ్మర్‌కి మీ ఊరు వస్తాం కదరా! ఎందుకు మమ్మీని ఏడిపిస్తావ్?" ప్లాట్‌ఫాం మీదనుండే సుధాకర్ భార్య రంజని సముదాయిస్తోంది.

"తప్పు కదురా! పెదనాన్న, పెద్దమ్మలకు 'టాటా' చెప్పాలి! అలా ఏడిస్తే బేడ్‌గర్ల్ అనుకుంటారు!" లగేజి అంతా సరిగా ఉందో, లేదో చూసుకుంటూ అన్నాడు దినకర్.

ట్రైన్ సికింద్రాబాద్ స్టేషన్ నుండి నెమ్మదిగా మూవ్ అవుతోంది.

ఇద్దరికీ లోయర్ బెర్తులు రావడంతో తమతమ బెర్తులపై కూర్చొని అన్నావదినలకు 'టాటా' చెబుతోంటే- ట్రైన్ కొంచెంకొంచెం వేగాన్ని పుంజుకుంటోంది. వారు క్రమక్రమంగా కనుమరుగవుతున్నారు.

అంతలో... ఒక పెద్దాయన పరుగుపరుగున వచ్చి, తన చేతిలోని చిన్నసూట్‌కేస్‌తో లోపలికి ప్రవేశించాడు.

"ఏయ్‌ం పెద్దాయనా... ఏమిటా పని? పట్టు తప్పావంటే డైరెక్టుగా పరలోకానికి పోతావ్!" తూలుతూ ఆయాసపడుతూన్న ఆయన్ని గట్టిగా పట్టుకొని, అరుపులాంటి మాటలతో నిలదీస్తూన్న రైల్వేపోలీస్ వైపు మళ్లింది దినకర్ దృష్టి.

"లేదు బాబూ..! వెళ్లిన పని పూర్తయ్యేసరికి లేట్ అయింది. గోదావరి అందుతుందో, లేదో అని గాభరాపడుతూ వచ్చాను. చాలా లక్... లేకుంటే ఈరోజు వేస్టు అయిపోయేది!" అన్నాడాయన.

ఆయన తెల్ల పంచె, లాల్చీ మీద కండువా ధరించి ఉన్నాడు. కళ్ళకి పెట్టుకున్న పూర్వకాలపు కళ్ళజోడు అతని పెద్దరికాన్ని ద్విగుణీకృతం చేస్తోంది.

"సరేలేవయ్యా... ఏమాత్రం అదుపు తప్పినా ఈపాటికి రైలుచక్రాల క్రింద ఉండేవాడివి!" పోలీస్ మాటలు పట్టించుకొనే స్థితిలో లేని ఆ పెద్దాయన- ఒగరుస్తూ, ముఖానికి పట్టిన చిరుచెమటల్ని తన కండువాతో తుడుచుకుంటూ, ప్రక్కనే ఉన్న సీటు మీద కూలబడ్డాడు.

"అన్నయ్యలు కావాలీ..." అంటూ ఏడుస్తూన్న పప్పీని సముదాయించే ప్రయత్నంలో ఉంది ప్రత్యూష.

దినకర్ తన బెర్త్ మీద చివరగా కూర్చుని- ఆయాసపడుతూ కూర్చున్న ఆ పెద్దాయన్ని గమనిస్తున్నాడు.

"వాటర్ తీసుకోండి!" కూల్‌జగ్‌లోంచి నీటిని గ్లాస్‌లో పోసి ఇచ్చేసరికి- మారు మాట్లాడకుండా గడగడా తాగేశాడు ఆయన.

పెదనాన్న ఇచ్చిన బిస్కెట్స్ ఇచ్చేసరికి కొంచెంకొంచెం ఏడుపు తగ్గుముఖం పడుతోంది పప్పీలో.

"ఈ పిల్లలు ఇంతేనండీ! అభం- శుభం తెలియదు వాళ్ళకి... తమ ఈడుపిల్లలు కనబడితే చక్కగా ఆడుకుంటారు. దూరమైతే ఏడుస్తారు!" ఆ పెద్దాయన అంటూన్న మాటల్ని వినీవిననట్లు వింటోంది ప్రత్యూష.

బ్యాగ్‌లోంచి పేపరు తీసి చదువుకోసాగాడు దినకర్.

"ఈ ఇష్యూలో 'సాహితీ కెరటాలు' శీర్షికలో ఆర్టికల్స్ ఏమిటో చెబుతారా?"

ఒకసారి ఆయన వైపు చూసి- మౌనంగా పేపరు అందించాడు దినకర్.

కొన్ని క్షణాలు గడిచాయి.

గోదావరి ఘట్‌కేసర్ దాటిన తరువాత వేగాన్ని పుంజుకొంది.

"మీ స్వస్థలం హైదరాబాదా?" అడిగాడాయన.

'అవు'నన్నట్లు తలూపాడు దినకర్.

"మరి... ఇప్పుడు ఎక్కడికి వెళుతున్నారు?"

"అనపర్తి!"

"బంధువుల ఇంటికా?"

"కాదండీ! మా పేరెంట్స్ ఉండేది హైదరాబాద్‌లో అన్న దగ్గర! నేను అనపర్తిలో బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నాను. ఉగాదికి మా పేరెంట్స్ దగ్గరికి వచ్చి తిరిగి బ్యాక్ అవుతున్నాము!"

"నైస్ టూ మీట్ యూ... ఐ యామ్ మధుమూర్తి!"

"థాంక్యూ!" చేయి నందించాడు దినకర్.

"మీరు ఎక్కడిదాకా?" అడిగాడాయన్ని.

"తుని!"

"మీరేం చేస్తుంటారు?"

"నేను టీచర్‌గా వర్క్ చేసి రిటైరయ్యాను. ప్రస్తుతం ఈ పత్రికకే విలేఖరిగా పనిచేస్తున్నాను!" చేతిలోని పేపర్‌ని దినకర్‌కి అందించాడు మధుమూర్తి.

"చాలా సంతోషమండీ!"

ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీలలో ఆయన ఓ ప్రత్యేకతను సంతరించుకున్నట్లు కనబడుతున్నాడు.

"సాహితీ కెరటాలు'లో ఉగాది గురించి వ్రాసిన నా ఆర్టికల్ ఇది!" చూసిన దినకర్‌కి క్రింద 'టి.మధుమూర్తి' అనే బోల్డులెటర్స్ అందంగా కనబడుతున్నాయి.

"వెరీనైస్ సర్! ఇందాక చదివాను. చాలా బాగుంది!" అన్నాడు దినకర్.

"థ్యాంక్స్..." అంటూ-

"అమ్మాయీ! నీ పేరేంటి?" అడిగాడాయన ప్రత్యూషని.

"ప్రత్యూష!" చెప్పింది పాపని జోకొడుతూ.

"ఈమెది వైజాగ్! మా ఫాదర్ ఇన్‌లా విశాఖపట్నంలో పనిచేస్తుంటారు!"

దినకర్, మధుమూర్తిల సంభాషణ ముందుకు సాగిపోతోంది. అనకాపల్లి బెల్లం మార్కెట్ నుండి అమెరికా బిన్‌లాడెన్ దాడి వరకూ వారి సంభాషణ జరుగుతోంది. వారి మాటల్ని ప్రక్క ప్రయాణికులు ఆసక్తిగా ఆలకిస్తున్నారు. ఒకరిద్దరు వారి చర్చల్లో పాలు పంచుకుంటున్నారు కూడా.

ప్రత్యూష మటుకు చాల అసహనం ఫీలవుతోంది. తన భర్త మంచివాడేగాని, అతనిలో ఆమెకు నచ్చని అంశం అదే! ఏదో మనుషులంటే మొహం వాచిపోయినట్లు ప్రవర్తించడం ఒక్కోసారి ఆమెకు చికాకు గొలుపుతుంటుంది. ఆడయినా, మగయినా కనిపించిన ప్రతివారితోనూ ఎంతో పూసుకున్నట్లు మాట్లాడుతుంటాడు. మనుషులంతా ఆయన లాగా ఉంటారా? తమ తమ అవసరాల

కొరకు మాట్లాడేవారు కొంతమంది అయితే.., కాలక్షేపం కోసం కబుర్లు చెప్పేవారు కొందరు. అవేమీ ఆయన పట్టించుకోరు. 'స్నేహితు'లంటూ ఎవరినెవర్నో ఇంటికి తీసుకొచ్చి 'కాఫీ'లంటూ, 'టిఫిన్'లంటూ పెట్టి ప్రాణం తీస్తుంటాడు!

"ఇలా అడ్డమయిన వాళ్ళనీ 'ఫ్రెండ్‌షిప్' అంటూ చేరదీసి మన విషయాలు వాళ్ళకి చెబుతూంటే ఒక్కోసారి మనల్నీ ఇరుకునబెడుతుంటారు!" గతంలో ఒకటి రెండుసార్లు గట్టిగా చెప్పింది.

నొచ్చుకోవడం దినకర్ వంతు అయింది.

"ప్రత్యూ..! మనకు మనవారు దూరంగా ఉన్నారు. ఉద్యోగం అంటూ, సంపాదనంటూ మనం వారికి దూరమయ్యాం. ఎప్పుడో ఆరునెలలకొకసారి వాళ్ళని చూసి రావడం తప్ప- ఏం చెప్పలేకపోతున్నాం. ఎప్పుడూ మనిషి ఇతరుల నుండి తన పట్ల ఓ మంచిమాటను కోరుకుంటూ ఉంటాడు. అలా మంచిగా వ్యవహరించినపుడు వారి హృదయం ఎంతగానో సేదదీరుతుంటుంది.

అలాగే మనం మనతోటివారి పట్ల అభిమానంగా ఉన్నప్పుడు ఎక్కడో ఉన్న మనవారి పట్ల కూడా అక్కడ మనలాంటివారు ప్రతిస్పందిస్తుంటారు. అసలు ఎప్పుడు, ఏ అవసరం, ఎవరి ద్వారా కల్గుతుందో ఎవరు చెప్పగలరు చెప్పు? మనం ఎవరికీ ధనధాన్యాలు ఈయడం లేదు. ఒక మంచిమాటని ఇచ్చి స్నేహభావాన్ని పెంచి పోషిస్తున్నామంతే!"

భర్త వితండవాదన ఆమెను అసహనానికి గురిచేస్తుంది. క్రమంగా 'ఈ మనిషి ఇంతేలే...' అనుకొని సరిపెట్టుకోవడం ఆమెకు అలవాటయిపోయింది.

"టికెట్ ప్లీజ్..." టి.సి. వచ్చి వారి సంభాషణకు అంతరాయం కలుగజేశాడు. దినకర్, ప్రత్యూషల టికెట్స్ వెరిఫై చేసి, "సార్! మీ టికెట్ చూపిస్తారా?" అంటూ మధుమూర్తి వైపు తిరిగి అడిగాడు.

"నేను లాస్ట్‌మినిట్‌లో రావడంతో టికెట్ తీసుకొనే టైం లేకపోయింది. ఐయామ్ ఎ ప్రెస్‌రిపోర్టర్ ఎట్ తుని... జర్నీ అర్జంట్ కావడంతో కదులుతూన్న ట్రైన్ ఎక్కవలసి వచ్చింది. నేను చేసింది పొరబాటు అయినా... ఎక్స్క్యూజ్ జేసి టికెట్ కమ్ రిజర్వేషన్ ఇస్తే- ఐ విల్ బి థ్యాంక్‌ఫుల్ టు యు!"

టి.సి మధుమూర్తి వైపు ఎగాదిగా చూశాడు. అతని ముఖంలో 'నీలాంటి వాళ్ళని చాలామందిని చూశాను లేవోయ్!' అనే భావన ద్యోతకమవుతోంది.

"చాలామంది టి.సి. వచ్చి నిలేస్తే ఏవో దొంగలా కబుర్లు చెబుతుంటారు. లేకపోతే టికెట్ లేకుండా ప్రయాణిస్తుంటారు... గవర్నమెంట్ తమ స్వంత ఆస్థి అయినట్లు!" అన్నాడు.

"అదికాదు సార్... ఐయామ్ నాట్ సచ్ ఏ పర్సన్!"

"సరేలే! ఆ మాటలెందుకుగానీ... ఫైన్‌తో సొమ్ముల్ని పే చేస్తారా? లేక, కేస్ బుక్ చేయమంటారా?"

మధుమూర్తి ముఖంలో విచారం అలుముకొంది. చేసేదిలేక పర్సుకోసం పాకెట్‌లో చేయిపెట్టాడు. ఆత్రుతగా సూట్‌కేస్ తెరిచాడు. ఒక్కసారి ముచ్చెమటలు పోశాయి ఆయనకి.

టి.సి. నిర్లక్ష్యంగా నవ్వి, "నీలాంటి వాళ్ళని నా సర్వీస్‌లో చాలామందిని చూశాను. నెక్స్ట్‌స్టేషన్‌లో దిగు. డ్యూటీకి వచ్చానో, లేదో... బేవార్స్ కేస్ తగిలింది!" అన్నాడు.

నీళ్లు సుడులు తిరిగాయి మధుమూర్తి కనుకొలకుల్లో.

'నాకు తెలియదా ఏమిటి... ఇటువంటివారు మాటలు చెప్పి ఇతరుల మీద వాలిపోవడానికి ప్రయత్నిస్తారు. ఈయనేమో అందరితోనూ పూసుకొని మాట్లాడతారు. ఇప్పుడు మరోసారి ఇదే విషయం ఋజువయింది!' ప్రత్యూష అంతరంగంలో మధుమూర్తి పట్ల భావతిరస్కారం కదలాడింది.

"నా పర్సు పోయింది. వెతికితే కనబడడం లేదు! దినకర్‌గారూ... ఇఫ్‌యూ డోంట్‌మైండ్- నాకు ఓ నాలుగువందల రూపాయలు సహాయం చేస్తే... ఇంటికి చేరిన వెంటనే మీకు ఎమ్.ఓ. చేస్తాను!" ఒక్కసారి మధుమూర్తి ముఖంలోకి చూశాడు.

అభ్యర్ధనగా అంటూన్న ఆయన మాటలు చాలా నిజాయితీగా ఉన్నట్లు అనిపిస్తోంది. కానీ, వాటిని తను ఎంతవరకు నమ్మగలడు? ఈరోజుల్లో చాలామంది ఇలానే డబ్బులు గుంజుకోడానికి ఏదో ఒక టెక్నిక్ ఉపయోగిస్తూంటారు. కానీ, ఈ పెద్దమనిషి అలా అగుపించడం లేదు. నాలుగు వందలు మరల ఎమ్.ఓ. చేస్తానంటున్నాడు. భార్య మొహంలోకి చూశాడు... ఆమె వద్దన్నట్లు చికాకుగా చూసింది. కానీ, ఆయనలోని పెద్దతనానికి స్పందించి నాలుగొందలు చేతిలో పెట్టాడు.

టి.సి. బెర్త్ రాసి ముందుకు సాగిపోయాడు. దినకర్ పట్ల కృతజ్ఞతతో ఆయన అంతరంగం ఉప్పొంగిపోయింది. అందరూ నిద్రలోకి జారుకున్నా, చాలాసేపటివరకు వారిద్దరూ కబుర్లలో మునిగిపోయారు.

అనపర్తి స్టేషన్‌లో దిగుతూ దినకర్ విజిటింగ్ కార్డు ఇచ్చేసరికి- తన ఎడ్రస్సు ఇచ్చాడు మధుమూర్తి.

● ● ●

"ప్రత్యూ... చూశావా! అందరూ అందరినీ మోసం చేస్తారని అనుకుంటావు. మధుమూర్తిగారు చూడు- వారం తిరక్కుండా నా సొమ్ములు పంపారు!"

...పోస్టుమేన్ నుండి మనీఆర్డర్ తీసుకుంటూ అనేసరికి-

"చాల్లెద్దురూ! ఏవో వందలు కాబట్టి పంపాడు. కాకపోతే ఈరోజుల్లో అందరూ ఏదో విధంగా దిగజారిపోయిన వాళ్ళే!" అంది ప్రత్యూష.

భార్యతో వితండవాదన అనవసరమని మిన్నకుండిపోయాడు దినకర్.

● ● ●

"హలో... దినకర్‌గారు కావాలండీ!"

"టెల్ మీ... ఐ యామ్ దినకర్!" ఉదయాన్నే కళ్ళు నులుముకుంటూ మంచం ప్రక్కనే ఉన్న ఫోనుని లిఫ్ట్ చేశాడు.

"సార్... నేను పాయకరావుపేట పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుండి మాట్లాడుతున్నా! తుని అవుట్‌స్కర్ట్స్‌లో ఇప్పుడే ఒక కారుప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్నవారు చెట్టును ఢీ కొనడంతో నుజ్జునుజ్జయింది. డ్రైవర్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. అందులో ప్రయాణిస్తూన్న ప్రత్యూష, పప్పీ అనే ఇద్దరు స్త్రీలకు కూడా బాగా దెబ్బలు తగిలాయి. మేడమ్ మీ ఫోన్‌నెంబరిచ్చి వెంటనే తుని గవర్నమెంట్ హాస్పటల్‌కి బయలుదేరి రమ్మన్నారు."

నిద్రమత్తు వదిలి హృదయం ఒక్కసారి భయంతో కంపించింది దినకర్‌కి. తన భార్యాపిల్లలు ప్రయాణిస్తున్న కారుకు యాక్సిడెంటా? ఎలా ఉన్నారో తలచుకుంటే ముచ్చెమటలు పడుతున్నాయి. తునిలో తనకు తెలిసినవారు ఎవరున్నారు? ఆఫీసుకు సంబంధించి ఎవరైనా ఉన్నా ఇమ్మీడియట్‌గా ఎంతవరకు రియాక్ట్ అవుతారు?

ఒక్కసారి మధుమూర్తి జ్ఞాపకం వచ్చారు. ఎప్పుడో ఐదుసంవత్సరాల క్రితం రైలులో పరిచయమైన వ్యక్తికి తాము గుర్తుంటామా? అసలు ఆయనిప్పుడు ఆ ఊర్లో ఉన్నారో, లేదో? ఏదైనా ఇప్పుడు ఆయన సహాయం తనకు అత్యవసరం!

వెంటనే పాతడైరీలు వెతికి ఆయన ఫోన్‌నెంబర్ పట్టుకున్నాడు.

"మధుమూర్తిగారూ... నమస్తే! నేను అనపర్తి నుండి దినకర్‌ను మాట్లాడుతున్నా. మనం ఒకసారి హైదరాబాద్ నుండి వస్తూ గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో కలుసుకున్నాం... గుర్తుందా! నాకు ఇప్పుడు పెద్ద ఆపద వచ్చింది. నా భార్య, పిల్ల సంక్రాంతి పండక్కి వాళ్ళమ్మగారింటికి విశాఖపట్నం బయలుదేరారు. తుని దగ్గర కారుయాక్సిడెంట్ అని ఫోనొచ్చింది.

నేను బయలుదేరి వస్తున్నా! మీరు వెంటనే విషయం తెల్సుకొని అవసరాన్ని బట్టి పెద్దహాస్పటల్‌కి తరలించే ప్రయత్నం చేయండి! డబ్బు గురించి ఆలోచించవద్దు. ఎంతైనా ఫరవాలేదు. నేను తీసుకొని వస్తున్నా. దయచేసి నాకు ఈ సహాయం చేయమని కోరుతున్నాను!"

• • •

"మధుమూర్తి బాబాయ్‌గారూ! ఆరోజు మీరు ఆదుకోకపోతే మేము ఇక మిగిలేవాళ్ళం కాదు!" విశాఖపట్నం సిడిఆర్ హాస్పటల్ నుండి డిశ్చార్జి అయినపుడు ప్రత్యూష అన్నమాటలు అందరికీ ఆయన పట్ల ఆత్మీయతాభావన కలుగజేశాయి.

"నేనేం చేశానమ్మా... ఏదో ఊరులో ఉన్నాను కాబట్టి చేయగలిగింది చేశానంతే! ప్రికాషనరీ మెజర్‌గా ఇన్‌టెన్సివ్ కేర్‌కి తీసికెళ్లాను. తరువాత దినకర్ సలహా మీద వైజాగ్ తరలించాం!"

"యాక్సిడెంట్ అయిన వెంటనే చాలా బ్లడ్ పోయింది. చొరవదీసుకొని బ్లడ్‌బ్యాంక్ నుండి రక్తం తెప్పించి ఎక్కించారు. కాబట్టి బ్రతికి బట్టకట్టగలిగాను. లేకుంటేనా..? తలచుకుంటే గుండెల్లో గుబులేస్తోంది!" బంధువర్గం అంతా ముక్తకంఠంతో అంటూంటే దినకర్ హృదయం ఆమెను కాపాడానన్న భావనతో ఉప్పొంగిపోతోంది.

'మనిషికి ఎప్పుడు, ఎవరితో అవసరం వస్తుందో ఏమి తెలుసు? అందుకే సాటిమనిషిని మనం ప్రేమించగలిగిన నాడు- భగవంతుడు మనల్ని కరుణించి అపాయాన్ని తప్పించడానికి ఉపాయం చూపిస్తాడు!' భర్త మాటలు గుర్తుకువచ్చాయి ప్రత్యూషకి.

"మనకి దేవుడు బాబాయ్‌గారి రూపంలో సాక్షాత్కరించాడు!" ఆత్మీయులనదగ్గ అక్కడివారి మాటలతో మధుమూర్తి మనసు మధురానుభూతి నొందింది. హృదయం ద్రవించడంతో మాట కరువయింది.

ఆ క్షణంలో ప్రత్యూష తనలోని సంకుచితధోరణికి సిగ్గుతో కుచించుకుపోయింది.

తన భర్త ఆమెకు అపురూపమైన వస్తువుగా అన్పించసాగాడు.